క్లుప్తంగా

సోమేశ్వరుడి సన్నిధిలో సీబీఐ కోర్టు ఏఓ



ఏఓ శ్రీనివాస్ దంపతులకు స్వామివారి ప్రసాదాన్ని అందజేస్తున్న అర్చకులు

పాలకుర్తి టౌన్: శ్రీసోమేశ్వరాలయంలో సీబీఐ కోర్టు నాంపల్లి ఏఓ(అడ్మిస్టేట్ ఆఫీసర్) కొలిపాక శ్రీనివాస్ దంపతులు శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు వారికి స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ ఈఓ మోహన్‌బాబు, అర్చకులు దేవగిరి లక్ష్మన్న, డీవీఆర్.శర్మ, దేవగిరి నాగరాజు, మత్త గజం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'అవకాశవాదులకు పదవులు ఇవ్వొద్దు'



కాంగ్రెస్ మండల అధ్యక్ష పదవి కోసం దరఖాస్తు చేస్తున్న పృథ్వీరెడ్డి

దేవరుప్పుల: కాంగ్రెస్ పార్టీ సంస్థాగత ఎన్నికల్లో అధికారం ఉన్నచోట వాలే పార్టీ ఫిరాయింపు అవకాశవాదులకు పదవులు ఇవ్వొద్దని కాంగ్రెస్ మండల నాయకుడు ఇప్ప పృథ్వీరెడ్డి కోరారు. శనివారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో శ్రీలతకు ఆయన దేవరుప్పుల మండల అధ్యక్షుడి స్థానం నామినేషన్ (దరఖాస్తు) దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి రాక ముందు కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం పని చేసిన వారికి గుర్తింపు దక్కలేదని, ఇతర పార్టీల నుంచి వచ్చిన వారు, పార్టీ గెలుపు కోసం కష్టపడని వారే పదవుల్లో కొనసాగుతున్నారన్నారు. ఈ విషయం అధిష్టానం గుర్తించిందని, ఇప్పుడు జరగనున్న సంస్థాగత ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కష్టపడ్డ వ్యక్తులకు, సమర్థులకే పదవులు దక్కుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రానున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం సమర్థవంత యువ నాయకత్వానికి పార్టీ పగ్గాలు అప్పజెప్పాలని ఎంఎల్ఏ యశస్వినిరెడ్డి, పార్టీ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డిలకు ఆయన విజ్ఞప్తి చేశారు.

పరామర్శ



అశోక్‌ను పరామర్శిస్తున్న వెంకటమల్లయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: పాంనూర్ గ్రామానికి చెందిన గీతకార్మికుడు తాళ్లపెల్లి అశోక్ తాటిచెట్టుపై నుంచి శుక్రవారం సాయంత్రం ప్రమాదవశాత్తు పడి గాయపడి జనగామ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బాల్నె వెంకటమల్లయ్య శనివారం ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. అశోక్ ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాటిచెట్టుపై నుంచి పడి గాయపడ్డ అశోక్‌కు ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించాలని, నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కేజీకేఎస్ నాయకులు శ్రీనివాస్, మాచర్ల రఘురాములు, గట్టు రమేష్, బత్తిని శ్రీను, తాళ్ళపెల్లి బాబు, నర్సయ్య, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

'సిబిల్' లేకుండా రుణాలు ఇవ్వాలి

జఫర్‌గఢ్: ఎలాంటి సిబిల్ స్కోర్ లేకుండా రాజీవ్ యువవికాసం రుణాలు ఇచ్చి యువతను ఆదుకోవాలని మహజన ప్రజా పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు జెట్టి రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎలాంటి షరతులు లేకుండానే అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి రుణాలు మంజూరు చేయాలన్నారు. లేని పక్షంలో యువతను సమీకరించి ఆందోళన చేపట్టాల్సి వస్తుందని పేర్కొన్నారు.

జబర్దస్త్ టీం సందడి

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలో జరిగిన ఓ కార్యక్రమంలో జబర్దస్త్ టీం సభ్యులు పాల్గొని సందడి చేశారు. శనివారం పంచ్ ప్రసాద్, రైటర్ మురళీ, గడ్డం ప్రసాద్ విస్నూరులోని యువ దర్శకుడు ఎస్ఎస్ వర్మ ఇంట్లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అభిమానులు జబర్దస్త్ టీంతో ఫొటోలు దిగారు.

పారిశుద్ధ్యం.. అస్తవ్యస్తం



కాలనీలోని గుంతలో నిలిచిన మురుగు నీరు

- దుర్వాసన, దోమలతో ఇబ్బంది పడుతున్న స్థానికులు

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలోని పోతన జూనియర్ కళాశాలకు వెళ్లే దారిలో ఎండీ మదార్ ఇంటికి ఎదురుగా గుంతలో మురుగునీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. కాలనీలో సైడ్ డ్రెయినేజీ లేకపోవడంతో గుంతలో మురుగు నీరు చేరింది. దీంతో దోమలు విజృంభిస్తున్నాయి. దుర్వాసన, దోమలతో ప్రజలు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి గుంతను పూడ్చి సైడ్ డ్రెయినేజీని నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన పేదలకు అందించాలని కోరుతూ స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శివునిపల్లి గ్రామానికి చెందిన యువకులు శనివారం డివిజన్ కేంద్రంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శివునిపల్లిలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఇష్టారాజ్యంగా లబ్ధిదారులను ఎంపిక చేశారన్నారు. అర్హులైన పేదలను విస్మరించి నాయకులే ఇళ్లను పెట్టుకున్నారని, దాంతో పేదవారి సొంత ఇంటి కల కలగానే మిగిలిపోతుందన్నారు. ఈవిషయమై సానుకూలంగా స్పందించి లబ్ధిదారుల జాబితాను పునఃపరిశీలన చేయాలని, అర్హులైన పేదలకు అందించాలని వారు కోరారు. పి.రాహుల్, ఎన్.కుమార్, అలుగు వికాస్, నాగరాజు, ప్రశాంత్, శివకుమార్, కార్తీక్, రాకేష్, చరణ్, గణేష్, సాయికిరణ్, భార్గవ్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కడియం శ్రీహరికి వినతిపత్రం అందజేస్తున్న యువకులు

రఘునాథపల్లి: పక్కా ఇల్లు లేని పేదలకే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని సీపీఎం మండల కార్యదర్శి కావటి యాదగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని కంచనపల్లిలో జరిగిన సీపీఐ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. అర్హులకు కాకుండా అనర్హులకు ఇళ్లు మంజూరు చేస్తే పేదలతో కలిసి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా గ్రామ సీపీఐ గ్రామ కార్యదర్శిగా కందుకూరి మల్లేశంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహాసభలో సీపీఐ సీనియర్ నాయకులు నాల్వపల్లి దావీదు, దానియేలు, వెంకటయ్య, విజయ్, సంజీవ, మల్లేశం, వెంకటయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యాదగిరి

అకాల వర్షంతో అంతా ఆగమాగం



జఫర్‌గఢ్: తిమ్మంపేటలో కొనుగోలు కేంద్రం వద్ద తడిసిన ధాన్యం





నర్మెట: రేకులు ఎగిరిపోయిన ఇంట్లో బాధితులు, ధ్వంసమైన సామగ్రి.

- కొనుగోలు కేంద్రాల వద్ద తడిసిన ధాన్యం

జఫర్‌గఢ్: మండలంలో శనివారం సాయంత్రం ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షం కురియడంతో రైతులు, ప్రజలు ఆగమాగమయ్యారు. కొనుగోలు కేంద్రాలు, కల్లాలు, రోడ్లపై ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. దీంతో రైతులకు తీవ్ర నష్టం జరిగింది. కొద్ది రోజులుగా ప్రభుత్వానికి విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలు, కల్లాలు, రోడ్లపై రైతులు ధాన్యాన్ని నిల్వ చేశారు. కొనుగోళ్లలో ఆలస్యం అవుతుండటంతో అకాల వర్షం కురియగా ధాన్యం తడిసిపోయింది. ఐకేపీ, సంబంధిత అధికారుల నిర్లక్ష్యం వల్లే తమకు నష్టం జరిగిందని రైతులు పేర్కొంటున్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆదుకోవాలని ఆదుకోవాలని రైతులు కోరారు.

గాలి దుమారం..

నర్మెట: హన్మంతాపురం లుంబ్యాతండాలో శుక్రవారం సాయంత్రం వీచిన గాలిదుమారానికి మాలోత్ మోహన్ ఇంటిపైకప్పు రేకులు ఎగిరిపోయి ఇంట్లోని సామాను, టీవీ, వంట సామగ్రి ధ్వంసం కాగా తీవ్ర నష్టం వాటిల్లింది. నిరుపేద కిషన్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటంబ సభ్యులు, తండావాసులు కోరారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్

రఘునాథపల్లి: రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు ప్రకియ వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ ఐకేపీ నిర్వాహకులను ఆదేశించారు. శనివారం మండలంలోని ఖిలాషాపూర్, జాఫర్‌గూడెం, వెల్ది, అశ్వరావుపల్లి, గోవర్ధనగిరిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు. కొనుగోలు కేంద్రాల్లోని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యంకు తేమశాతం రాగానే జాప్యం చేయకుండా కాంటా వేసిన బస్తాలను వెంటనే ట్యాగ్ చేసిన మిల్లులకు పంపాలన్నారు. అకాల వర్షాల నేపథ్యంలో నిర్లక్ష్యం వహించకుండా జాగ్రత్తలు తీసుకోవలన్నారు. కేంద్రాల్లో సరపడు టార్పాలిన్లు, గన్నీ సంచులను అందుబాటులో ఉంచాలని ఆయన ఆదేశించారు. ఆర్ఐ శరత్‌చంద్ర, సీసీ సంపత్ ఉన్నారు.



కొనుగోలు కేంద్రంలో నిర్వాహకులకు సూచనలు ఇస్తున్న అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్

'రైతులను పట్టించుకోని ప్రభుత్వం'



ధాన్యం బస్తాలను పరిశీలిస్తున్న నాయకులు

జఫర్‌గఢ్: రైతులను ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో వారు ఇబ్బందులకు గురవుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాపర్తి రాజు పేర్కొన్నారు. తమ్మడపల్లి (జి) గ్రామంలో రోడ్లపై, ఆరబోసిన, బస్తాల్లో నింపిన ధాన్యంను పార్టీ బృందంతో కలిసి ఆయన శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా రాజు మాట్లాడుతూ రైతులు రోడ్లపై, కల్లాల వద్ద బస్తాల్లో ధాన్యం నింపి ఎదురు చూస్తున్నారన్నారు. ఐకేపీ, సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ధాన్యాన్ని పూర్తి స్థాయిలో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ మండల కార్యదర్శి గుండెబోయిన రాజు, రైతు సంఘం నాయకులు ఎండి శంషోద్దీన్, వడ్లకొండ రాజు, నక్క వేణు, రైతులు మారపల్లి కుమారస్వామి, ఎండి నాసర్, మొగిళి, కిరణ్, ఎల్లాచారి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా ప్రధాన పాత్ర పోషిస్తోంది

- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కావ్య

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రస్తుతం రాజకీయ రంగంలో సోషల్ మీడియా ప్రధాన పాత్ర పోషిస్తోందని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. శనివారం స్థానికంగా నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా వారియర్స్ నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా సోషల్ మీడియా వారియర్స్ క్రియాశీలకంగా పనిచేయాలన్నారు. బీఆర్ఎస్, బీజేపీ తదితర ప్రతిపక్ష పార్టీలు సోషల్ మీడియా ద్వారా అసత్యపు ప్రచారాలు చేస్తున్నాయని, ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ సోషల్ మీడియా, యువజన కాంగ్రెస్‌లో చురుగ్గా పనిచేసేవారికి ప్రభుత్వ పథకాలలో ప్రాధాన్యత ఉంటుందన్నారు. పార్టీ కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికీ సరైన గుర్తింపు ఉంటుందని చెప్పారు. టీపీసీసీ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ మున్నె సతీష్, నాయకులు జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి, బెలిదె వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న సంఘం బాధ్యులు

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రానికి చెందిన అభివృద్ధి పరపతి సంఘం కమిటీ సభ్యుడు తాటికొండ(బండల) రాజయ్య ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. కాగా, పరపతి సంఘం బాధ్యులు శనివారం బాధిత కటుంబాన్ని పరామర్శించి రూ.5వేల సాయం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజయ్య దళిత సంఘాల కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేవాడని, అందరితో కలివిడిగా ఉండే రాజయ్య మృతి తీరనిలోటన్నారు. ఆయన మృతిపట్ల ప్రగాఢ సంతాపం తెలిపారు. కమిటీ అధ్యక్షుడు కలకోల యాదగిరి, ప్రధాన కార్యదర్శి పెసరు సారయ్య, రాజబాబు, కుమార్, నీల నర్సింహులు, ఆరోగ్యం, ప్రవీణ్, అశోక్, గిరి, రవి తదితరులు ఉన్నారు.

వీర జవాన్‌కు కొవ్వొత్తులతో నివాళి



బచ్చన్నపేట: కొవ్వొత్తులతో ర్యాలీ తీస్తున్న పాత్రికేయులు తదితరులు

రఘునాథపల్లి/బచ్చన్నపేట: దేశం కోసం ప్రాణాలర్పించిన ఆర్మీ వీర జవాన్ మురళీనాయక్ మృతికి నివాళిగా రఘునాథపల్లి, బచ్చన్నపేట మండల కేంద్రాల్లో యువకులు, పాత్రికేయులు శనివారం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ యుద్ధంలో అమరులైన జవాన్ల ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. రఘునాథపల్లిలో ర్యాలీకి గ్రామ మాజీ సర్పంచ్ పోకల శివకుమార్ తదితరులు సంఘీభావం తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో యువకులు బత్తోజు రాజేంద్రచారి, చింతకింది ప్రభాకర్, కడారి శ్రీనివాస్, పాత్రికేయులు మంచాల సంతోష్‌కుమార్, మల్యాల బాల్‌నర్సయ్య, నాయకులు మహాత్మాచారి, కొత్తపల్లి శ్రీనివాస్, జగన్, రమేష్, కేశయ్య, కిషన్ తదితరులు పాల్గొన్నారు.



రఘునాథపల్లిలో ర్యాలీ తీస్తున్న యువకులు

తిరుమలలో గోవర్ధనగిరి అధ్యాత్మిక బృందం



తిరుమల హరినామ సంకీర్తనలో గోవర్ధనగిరి అధ్యాత్మిక బృందం

రఘునాథపలి: మండలంలోని గోవర్ధనగిరి శ్రీ బాలాంజనేయ అధ్యాత్మిక భజన బృందం తిరుమలలో అఖండ హరినామ సంకీర్తన చేసే అవకాశాన్ని అందిపుచ్చుకుంది. బృందం అధ్యక్షుడు గొడుకు రాజు సారధ్యంలో తిరుమలలో అత్యంత భక్తిశ్రద్ధలతో అధ్యాత్మిక భజనలు చేసి భక్తులు, ఆలయ అర్చకులచే ప్రశంసలు పొందారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ తిరుమల ఆలయ నిర్వాహకుల ఆహ్వానం మేరకు అఖండ హరినామ సంకీర్తనలో పాల్గొని నిర్వాహకుల నుంచి ప్రశంసలు అందుకుని శనివారం స్వగ్రామానికి చేరుకున్నామన్నారు. కార్యక్రమంలో కుసుంబ మధు, బృందం సభ్యులు దొనికల రమేష్, గొట్టిముక్కల వెంకటయ్య, గొడుగు సారయ్య, ముసిపట్ల నాగమౌళి, ఐలయ్య, రామ్, శంకర్, హరిప్రసాద్, నాగరాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

జనగామ రూరల్: శ్రీవాణి విద్యాలయ 2002–2003 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆధ్వర్యంలో మిత్రుడు గుగులోత్ రఘుపతి జ్ఞాపకార్థం శనివారం పట్టణంలోని కోమటిరెడ్డి సుశీలమ్మ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రఘుపతి తల్లి ధర్మమ్మ, మిత్రులు పన్నీరు కరుణాకర్, గుగులోత్ శ్రీను నాయక్, బనికె చంద్రశేఖర్, ఈర్ల పూర్ణ చందర్, కృష్ణ, సంపత్, వృద్ధులు పాల్గొన్నారు.



వృద్ధాశ్రమంలో అన్నదానం చేస్తున్న మిత్రులు

పేద పిల్లలకు..

సేవాలాల్ సేన జిల్లా యువజన అధ్యక్షుడు తేజావత్ మోహన్ నాయక్ పుట్టినరోజు సందర్భంగా శనివారం జిల్లా ఆస్పత్రి, జనగామ రైల్వే స్టేషన్ బస్టాండ్ వద్ద గుడిసెల్లో ఉన్న పిల్లలకు పులిహోర, అరటి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మంతెన మణి, తదితరులు పాల్గొన్నారు.



పిల్లలకు పండ్లు అందజేస్తున్న అమ్మ టీం సభ్యులు

ఆటో.. 'ఆపరేషన్ సిందూర్'

జనగామ: పాకిస్తాన్‌పై విజయమే లక్ష్యంగా భారత్ చేపట్టిన యుద్ధానికి సంపూర్ణ మద్దతు తెలుపుతూ ఓ ఆటో వాలా తన వాహనానికి 'ఆపరేషన్ సిందూర్' గా నామకరణం చేశారు. జనగామ మండలం పెంబర్తికి చెందిన ఆటో యజమాని రేపాల కోటేశ్వర్‌రావు తన ఆటోకు ఈ పేరుతో కూడిన స్టిక్కర్ వేసి.. జై భారత్ జైజై భారత్ అంటూ సెల్యూట్ చేసి నినాదాలు చేశారు. ఇక నుంచి ఆపరేషన్ సిందూర్ ఆటోగా పిలవాలని గ్రామస్తులను కోరారు.



ఆటోకు ఆపరేషన్ సిందూర్‌గా నామకరణం చేసి సెల్యూట్ చేస్తున్న కోటేశ్వర్‌రావు

కనులపండువగా వారకల్యాణం



పూజల్లో పాల్గొన్న భక్తులు

చిల్పూరు: బుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో శనివారం ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న, చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావుల ఆధ్వర్యంలో వారకల్యాణాన్ని అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేద మంత్రాల నడుమ కనులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు వరంగల్ కరీమాబాద్‌కు చెందిన రచ్చ శ్రీకాంత్–దీప్తిలు అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ కుర్రెంల మోహన్, వీరన్న, లక్ష్మి, మల్లికార్జున్, హరిశంకర్, వసంత, మహేష్, గాదె శేఖర్, రాజేష్, విశాల్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి విజేందర్

జనగామ రూరల్: కేంద్రం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సుంచు విజేందర్ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కార్యాలయంలో సమ్మె వాల్ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సందర్భంగా విజేందర్ పాల్గొని మాట్లాడుతూ.. దేశంలో 12 ఏళ్లుగా మోదీ సర్కారు కార్మికుల హక్కులను అణచి వేసే విధంగా వ్యవహరిస్తోందని, పోరాడి సాధించుకున్న 29 చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందన్నారు. కార్పొరేట్ శక్తులకు అనుకూల విధానాలు అమలుచేస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా చేపట్టే దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు, కర్షకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో బూడిద ప్రశాంత్, తాండ్ర ఆనందం, గంగరబోయిన మల్లేశ్‌రాజ్, శివరాత్రి రాజు, చీర శ్రీనివాస్, ఉపేందర్,, సురేష్, నాయక్ తదితరులు పాల్గొన్నారు.



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు